పల్లె దవాఖానాల్లో సౌకర్యాలు కరువు

- ఫర్నిచర్, వైద్య సిబ్బంది కొరత
- పట్టించుకోని వైద్యారోగ్య శాఖ



మహమ్మద్‌నగర్ పల్లె దవాఖానా

నిజాంసాగర్(జుక్కల్) : పల్లె ప్రజానికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె దవాఖానాలను ప్రారంభించింది. దవాఖానాల భవనాల నిర్మాణం చేపట్టినా, వాటిలో కనీస సౌకర్యాలు మాత్రం కరువయ్యాయి. ఆస్పత్రి వైద్యులతో పాటు సిబ్బంది, రోగులు కూర్చునేందుకు కనీసం కుర్చీలు, బల్లాలు, ఫర్నిచర్ లేవు. జుక్కల్ నియోజకవర్గంలోని మహమ్మద్ నగర్, నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, మద్నూర్, జుక్కల్, డోంగ్లీ, బిచ్కుంద మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 27 పల్లె దవాఖానాలున్నాయి. ఆయా పల్లె దవాఖానాల్లో స్టాఫ్ నర్సులు, ఎంబీబీఎస్ వైద్యులను నియమించింది. పల్లె దవాఖానల్లో వైద్యులను భర్తీ చేసినా సిబ్బంది నియామకం చేపట్టలేదు. ఏ ఒక్క దాంట్లో కూడా కుర్చీలు, ఫర్నిచర్‌గానీ లేవు. వైద్యం కోసం వచ్చిన రోగులు నేలపైన కూర్చోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మహమ్మద్‌నగర్ పల్లె దవాఖానాలో..

మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని పల్లె దవాఖానాలో ఫర్నిచర్, మంచాల కొరత తీవ్రంగా ఉంది. నిత్యం పదుల సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. వివిధ రకాల జ్వరాలతో వచ్చిన రోగులకు గ్లూకోస్ పెట్టేందుకు మంచాలు కూడా లేవు. అంతేకాకుండా రోగులు, వైద్య సిబ్బంది కూర్చునేందుకు కుర్చీలు సైతం కరువయ్యాయి. ఈ పల్లె దవాఖానాలో మూత్రశాలలు, మరుగుదొడ్లకు సరైన నీటి వసతి, పైపులైన్ కనెక్షన్లు లేకపోవడంతో ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు.

సౌకర్యాలు లేవు



పల్లె దవాఖానా ద్వారా నిత్యం రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విధులు నిర్వహిస్తున్నాం. ఫర్నిచర్‌తో పాటు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం.
– అయేషా సిద్దికా, మహమ్మద్‌నగర్ పల్లె దవాఖానా, వైద్యుడు

నిధులు కేటాయించారు



ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న పల్లె దవాఖానాలకు ప్రభుత్వం రూ.80 వేల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఇంటర్‌నెట్‌కు రూ.5 వేలు, ఐఈఎల్‌కు రూ.25 వేలు మిగితావి ఫర్నిచర్ కోసం ఉపయోగించాల్సి ఉంటుంది.
– రోహిత్, నిజాంసాగర్ ఆరోగ్య కేంద్రం వైద్యుడు

క్లుప్తంగా

బీర్కూర్ సొసైటీ చైర్మన్ రాజీనామా

బాన్సువాడ: బీర్కూర్ సొసైటీ చైర్మన్ గాంధీ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం పాలకవర్గాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించిన విషయం తెలిసిందే. అనారోగ్యం కారణంగా తన చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా లేఖను కార్యదర్శికి అందజేశారు. డీసీవో.. గాంధీ రాజీనామాను ఆమోదించారు. బీర్కూర్ సొసైటీలో గతంలో అవినీతి జరిగినట్లు తెలిసింది.

నిధులు విడుదల చేయాలి



బాన్సువాడ: గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేయాలని బీర్కూర్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో భానుప్రకాష్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. మౌళిక వసతుల కల్పన కోసం సొంత నిధులు ఖర్చు చేశామని, తాము ఖర్చు చేసిన నిధులను విడుదల చేయాలని విన్నవించారు. నెలాఖరులోగా నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యదర్శులు సతీష్, శ్రీనివాస్, గురునాథ్, దివ్యభారతి, మోహన్, సుజాత తదితరులున్నారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్): పెండింగ్ బిల్లులు ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ సోమవారం జీపీ కార్యదర్శులు ఎంపీడీవో గోపాల్‌కు వినతి పత్రం అందించారు. మీ సమస్య పైఅధికారులకు వివరించి వినతి పత్రం పంపిస్తానని ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఎంపీవో కృష్ణ, కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వినతి



బాన్సువాడ : బోర్లం గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సోమవారం గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు.. సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఇటీవల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. తరగతి గదుల్లో, గురుకుల పాఠశాల చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. సమస్యను పరిష్కరిస్తానని సబ్ కలెక్టర్ అన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నేతలు



బాన్సువాడ: కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను సోమవారం కరీంనగర్‌లో బాన్సువాడ బీజేపీ నాయకులు కలిశారు. కరీంనగర్‌లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశానికి బాన్సువాడ నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి బీజేపీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కేంద్ర మంత్రి సూచించారని అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్‌కు తరలివెళ్లిన వారిలో బీజేపీ నాయకులు కోనాల గంగారెడ్డి, లక్ష్మీనారాయణ, సాయికిరణ్, అశ్విన్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా రవికుమార్



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా విద్య రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలోని వీకేవీ కన్వెన్షన్‌లో రవికుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరయ్యారు. ఈసందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. పద్మశాలీలు రాజకీయంగా మరింత ఎదగాలని అన్నారు. పద్మశాలి సంఘం నాయకులు, బీఆర్ఎస్ నేతలు తదితరులున్నారు.

విధుల్లో చేరిన కొత్త టీచర్లు



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల పరిధిలో ఐదుగురు కొత్త టీచర్లు సోమవారం విధుల్లో చేరారు. టీచర్లకు ఎంఈవోలు అమర్‌సింగ్, తిరుపతి రెడ్డిలు జాయినింగ్ లెటర్లు అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై వివాదం


మేజర్‌వాడిలో గ్రామస్తులతో చర్చిస్తున్న ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మేజర్‌వాడిలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు విషయమై నెలకొన్న వివాదాన్ని పరిష్కరించడానికి సోమవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు గ్రామాన్ని సందర్శించారు. మొదట గ్రామంలోని ఓ వర్గంవారు అంబేడ్కర్ విగ్రహాన్ని పాఠశాల ఎదుట ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాఠశాల ఎదుట తమ ట్రాక్టర్లను నిలుపుతామని, అక్కడ విగ్రహ ఏర్పాటు వల్ల తమకు ఇబ్బందులు కలుగుతాయని గ్రామానికి చెందిన కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలో ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఆర్డీవో ఆదేశాల మేరకు గ్రామ ముఖద్వారంలో గల ప్రధాన కూడలిలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కోసం నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎస్సై మల్లారెడ్డి మార్కింగ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగ కులాలకు న్యాయం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు


పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగ ఉప కులాలకు న్యాయం చేశారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మంజీర అతిథి గృహంలో మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన ఎస్సీ మాదిగ ప్రజాప్రతినిధుల సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో ప్రతీ ఉమ్మడి జిల్లాల్లో మేధావుల సమావేశం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మాదిగ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నేతలు

కామారెడ్డి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సోమవారం కమిషనర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి నెలా 5 లోపల వేతనం ఖాతాలో జమ చేసేలా చూడాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, కార్యదర్శి మహబూబ్ అలీ, ఉపాధ్యక్షుడు ప్రభు ఉన్నారు.

ప్రమాద బాధితుడికి రూ.60వేల ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న దాత

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రమాదంలో గాయపడిన నల్లమడుగు గ్రామానికి చెందిన హయాజ్‌కు రూ.60 వేలు ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. వివరాలు.. హయాజ్ ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా బాన్సువాడ సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కాలు విరగడంతో మంచానికే పరిమితమయ్యాడు. ఆపరేషన్ చేయించుకునేందుకు డబ్బులు లేవు. హయాజ్ నల్లమడుగులో ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. దాంతో స్నేహితులు, తోటి ట్యాంకర్ డ్రైవర్లు కలిసి రూ.60 వేలు జమచేసి బాధితుడికి అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన స్నేహితులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ కెమెరాలుంటే పోలీసులున్నట్లే



మాచారెడ్డి: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉంటే పోలీసులు ఉన్నట్లేనని మాచారెడ్డి ఎస్సై అనిల్ అన్నారు. పాల్వంచ మండలం ఇసాయిపేటలో మూఢనమ్మకాలు, సీసీ కెమెరాల ఆవశ్యకతపై సోమవారం రాత్రి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా మెజీషియన్ సుధాకర్ మిమిక్రీ అందరిని అలరించింది. గ్రామపెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్‌వాసికి విశిష్ట సేవా పురస్కారం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ గ్రామానికి చెందిన కొమ్ము దత్తుకు జాతీయ విశిష్ట సేవా పురస్కార అవార్డు లభించింది. ప్రాచీన కళా పోషణతోపాటు వివిధ రంగాలలో చేసిన సేవలను గుర్తించి కొమ్ము దత్తుకు హైదరాబాద్‌లోని సార్వత్రిక పరిషత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వ సంస్థ అధినేత డాక్టర్ రంజిత్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. మాజీ న్యాయమూర్తి మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి



కామారెడ్డి టౌన్: రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మసీద్, ప్రార్థనా మందిరాలలో అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ మసీద్-ఈ- ఫరూక్ కామారెడ్డి అధ్యక్షుడు ఇసాక్ షేరు సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మసీదుల వద్ద లైటింగ్, టెంట్, పరిసరాలను శుభ్రం చేయడం, ఎండాకాలం నేపథ్యంలో గ్రీన్ షెడ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, ముజాయిద్, అస్మత్ తదితరులున్నారు.

మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి


ఎల్లారెడ్డిలో రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

ఎల్లారెడ్డిరూరల్ : బోరు మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ డీఈ విజయ సారథి, రైతులకు సూచించారు. సోమవారం ఎల్లారెడ్డిలో రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రైతులు.. అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నారని, ఇలా చేయడం ప్రమాదకరమని సూచించారు. బోరు మోటార్ల వద్ద ఐరన్ బాక్సులను తొలగించి, ప్లాస్టిక్ బాక్సులను ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యుత్ సమస్యలుంటే సిబ్బందికి సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవాలని అన్నారు. ఏఈ వెంకటస్వామి తదితరులున్నారు.

ఇంటర్, పది పరీక్షలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సురేశ్

రామారెడ్డి : పదవ తరగతి, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో రామారెడ్డి రైతు వేదికలో సోమవారం నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షా పే చర్చ కార్యక్రమంన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామారెడ్డి ఎంఈవో ఆనందరావు, ఎస్సై నరేశ్, వైద్యాధికారి సురేశ్ హాజరయ్యారు. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. పరీక్ష వేళలో ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఏకాగ్రతతో చదువుపై దృష్టి సారించాలని ఎంఈవో ఆనందరావు సూచించారు. పరీక్ష సమయంలో పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. ఆరోగ్యంపై ప్రభావం పడకుండా జాగ్రత్తలు పాటించాలని రామారెడ్డి వైద్యాధికారి డాక్టర్ సురేశ్ సూచించారు. పరీక్షల కాలంలో చల్లటి పదార్థాలు తిని తలనొప్పి తెచ్చుకోవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. దృఢ సంకల్పంతో ముందుకు సాగితే ఏదైనా సాధ్యమేనని రామారెడ్డి ఎస్సై నరేశ్ అన్నారు. అవగాహన సదస్సులో రామారెడ్డి బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, కస్తూర్బా గాంధీ విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాలలో పొదల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



బాన్సువాడరూరల్(బాన్సువాడ): పరిసరాలు ఇలా ఆడుకునేది ఎలా అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తాకథనానికి కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి రాజు స్పందించారు. ట్రాక్టర్ సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించి పాఠశాల ప్రాంగణాన్ని చదును చేయించారు. సాక్షి చొరవతో సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మికం..

ఖండేరాయ మహదేవుడి కల్యాణ వేడుకలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్‌లో నిర్వహిస్తున్న ఖండేరాయ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం బిల్వ యాత్ర, భద్రకాళి పూజ, ఒగ్గుకథ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటి సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్లె రవి, కమిటీ ప్రతినిధులు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ కల్యాణ వేడుకలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన రేణుకా మాత ఎల్లమ్మ మందిరం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సోమవారం రేణుకా జమదగ్ని కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. గౌడ సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



నిజాంసాగర్(జుక్కల్): జక్కాపూర్‌లో హనుమాన్ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయం సన్నిధిలో రోజూ 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణంతో పాటు భజన సంకీర్తనలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వార్షికోత్సవానికి వచ్చిన కొండాపూర్ సంగ్రాం మహరాజ్‌ను ఆంజనాద్రి ఆలయ నిర్మాణ కర్త పట్లోళ్ల కిశోర్ కుమార్ సన్మానించారు.

ఘనంగా శోభాయాత్ర



దోమకొండ: మండల కేంద్రంలో సోమవారం శివస్వాములు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. స్థానిక చాముండేశ్వరి ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. శివస్వాములు వివిధ వేషధారణల్లో శోభాయాత్రలో పాల్గొని ఆకట్టుకున్నారు.

వైభవంగా శివ మహాపడిపూజ



కామారెడ్డి రూరల్: దేవునిపల్లిలోని దేవివిహార్‌లో ఆర్‌వీ రాజు జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం శివ పడిపూజ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. శివస్వాములు, భక్తులకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

శివస్వాముల పల్లకీసేవ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం శివస్వాములు పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల చిత్ర పటాలను పల్లకీ ఉంచి శబరిమాత ఆశ్రమం నుంచి గ్రామం వరకు ఊరేగించారు. గ్రామంలో ప్రధాన వీధులగుండా పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భిక్ష ఏర్పాటు చేశారు.

ఘనంగా మల్లికార్జున ఆలయ ఉత్సవాలు



భిక్కనూరు: గుర్జకుంటలో మల్లికార్జున ఆలయ ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, అగ్నిగుండాలు, మల్లిఖార్జున స్వామి వారి కల్యాణాన్ని కామరతితో ఆచారం ప్రకారం నిర్వహించారు. భక్తులకు భిక్కనూరుకు చెందిన డీవీ చలపతి–బబిత దంపతులు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మాచారెడ్డి: అక్కాపూర్‌లో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేయించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజలింగం, నాయకులు బుచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కురుమ చంద్రం, గోపాల్‌రెడ్డి, యుగంధర్, తదితరులున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలను గొల్లపల్లి అనంత్‌గౌడ్ సోమవారం పంపిణీ చేశారు. అవసరమైన స్టేషనరీని కూడా అందజేశారు. విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, నేతలు కందాడి లక్ష్మారెడ్డి, తక్కళ్ల మధు, పైతరి స్వామి, పెద్దొళ్ల రాజు, రాంరెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కు అందజేత



బాన్సువాడరూరల్(బాన్సువాడ): చిన్న రాంపూర్‌లో కొన్ని నెలల క్రితం షేక్ అజీజ్ అనే రైతుకు చెందిన ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్‌తో మృతి చెందింది. దీంతో నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.40 వేలు మంజూరైనట్లు బాన్సువాడ రూరల్ ఏఈ అనీల్ కుమార్ తెలిపారు. బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు.

కేజీబీవీలో ఉచిత వైద్య శిబిరం



రాజంపేట: మండలంలోని కేజీబీవీ వసతి గృహంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రాజంపేట వైద్యాధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వసతి గృహంలోని 224 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి 67 మంది విద్యార్థులకు మందులు అందజేశామన్నారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించామని తెలిపారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీ వాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.